
విలేకరులు కావలెను

ఆంధ్ర తెలంగాణ రెండు తెలుగు రాష్ట్రాలలో
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్స్, మండల
రిపోర్టర్, కంట్రిబ్యూటర్స్, యాడ్ ఎగ్జిక్యూటివ్స్, కావలెను
తెలుగు భాషపై అవగాహన, వార్తలు రాయగల సత్తా
ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును

JBN NEWS 24/7

MOBILE : 8886090199, 9885211993,

అనంత ప్రభ
తెలుగు దిన పత్రిక



అనంతపురం
శ్రీ సత్యసాయి
5
బుధవారం 11 మార్చి 2026

# ఏప్రిల్ 2 తర్వాత పరిపాలన స్తంభింపజేస్తాం..!

- ప్రజల జీవితాల్లో ఆర్డీటీ అనేది ఒక భాగం
- ప్రభుత్వాలకే స్ఫూర్తినిచ్చేలా ఆర్డీటీ సేవలు
- పార్లమెంట్ సమావేశాలు ముగిసేలోగా ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలి
- లేనిపక్షంలో కలిసొచ్చే పార్టీలు, ప్రజాసంఘాలతో కలెక్టరేట్ దిగ్బంధం
- వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు అనంత హెచ్చరిక



అనంతపురం, మార్చి 10 (అనంత ప్రభ)

ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయని పక్షంలో పరిపాలన స్తంభింపజేసామని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి హెచ్చరించారు. ఏప్రిల్ 2వ తేదీ వరకు పార్లమెంట్ సమావేశాలు జరుగుతాయని, అప్పటిలోగా ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేయాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం వైసీపీ సమన్వయకర్త తలారి రంగయ్య ఆధ్వర్యంలో మంగళవారం కుందుర్పిలో లక్ష పోస్టుకార్డుల ఉద్యమం ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, సమన్వయకర్తలు సాకే శైలజానాథ్, విశ్వేశ్వర్ రెడ్డి, జెడ్పి చైర్పర్సన్ బోయ గిరిజమ్మ, నియోజకవర్గ పరిశీలకులు మహేంద్రరెడ్డి, నాయకులు ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి లు హాజరయ్యారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ తొలుత అనంతపురం జిల్లాకు వచ్చినప్పుడు 'గో బ్యాక్ ఆర్డీటీ' అంటూ కొందరు వ్యతిరేకించారని, అప్పట్లో తన తండ్రి అనంత వెంకటరెడ్డి ఆర్డీటీకి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. ఈ రోజు ఆర్డీటీపై మతం ముద్ర వేసి దేశంలోనే లేకుండా చేయాలన్న కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం ఆర్డీటీ సంస్థ అహర్నిశలు కృషి చేసిందన్నారు. దళిత, గిరిజనులకు విద్యను చేరువ చేసిందని తెలిపారు. భూగర్భ జలాలు పెంపొందించడం కోసం తొలుత చెక్‌డ్యాంల నిర్మాణం చేపట్టింది ఆర్డీటీ సంస్థేనని తెలియజేశారు. ప్రభుత్వాలకు స్ఫూర్తినిచ్చేలా ఆర్డీటీ పని చేసిందని తెలిపారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ కోసం జిల్లాలో ఉద్యమాలు జరిగితే వాటిని కట్టడి చేసే ప్రయత్నాలను అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మానవత్వంతో పనిచేస్తున్న సంస్థకు అందరూ అండగా ఉండాలని, ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. ప్రస్తుతం పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్నాయని, ఏప్రిల్ 2వ తేదీలోగా ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ రెన్యూవల్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పరిపాలన స్తంభింపజేస్తామని.. ప్రజలు, కలిసొచ్చే పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి కలెక్టరేట్‌ను దిగ్బంధిస్తామని స్పష్టం చేశారు. ఆర్డీటీ విషయంలో ప్రజాప్రతినిధులు చిత్తశుద్ధితో వ్యవహరించాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. చివరకు గ్రామాల్లో అడుగుపెట్టలేని పరిస్థితిని తెచ్చుకోవద్దని తెలిపారు. ఆర్డీటీ పరిరక్షణ కోసం గతంలోనే బైక్ ర్యాలీ, పాదయాత్రలు చేశామని.. ఇప్పుడు ప్రధాని మోదీకి లక్ష పోస్టుకార్డులు పంపుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ వరకు ఈ కార్యక్రమం ఉంటుందని తెలియజేశారు. మన జీవితాల్లో ఆర్డీటీ ఒక భాగమని, అలాంటి సంస్థను అందరూ కలిసికట్టుగా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు

## పాత ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు
## 100 పడకల ఆసుపత్రిగా మారనున్న ధర్మవరం



ధర్మవరం, మార్చి 10 (అనంత ప్రభ)

మంత్రి సత్య కుమార్ యాదవ్ చొరవతో ధర్మవరంలో వైద్య సేవలకు భారీ ధర్మవరం పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో పాత ప్రభుత్వ ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రి నుండి 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి చర్యలు వేగవంతం అవుతున్నాయి. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి సహకారంతో ఈ ప్రతిపాదనపై అధికారులు మంగళవారం పరిశీలన చేపట్టారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి ఆదేశాల మేరకు ఆరోగ్య శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ రమేష్ నాథ్‌తో కలిసి ఆయన నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, పాత ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రి భవనం, అందుబాటులో ఉన్న సదుపాయాలు, వైద్య సేవల విస్తరణకు అవసరమైన వసతులపై అధికారులతో చర్చలు జరిపారు. ప్రస్తుతం 50 పడకలతో పనిచేస్తున్న పాత ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడం ద్వారా ధర్మవరం పట్టణం మరియు పరిసర గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందే అవకాశముందని అధికారులు తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు, అదనపు పడకలు, వైద్య సిబ్బంది వంటి సదుపాయాలను పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. అలాగే ధర్మవరం ప్రజలకు మరింత మెరుగైన ప్రసూతి మరియు శిశు వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్ (వీజ౦) కు కొత్త భవనం మంజూరు చేసే అంశంపై కూడా ఈ సందర్భంగా చర్చ జరిగింది. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తున్నదని, త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశముందని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..., ధర్మవరం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి ప్రధాన లక్ష్యమని తెలిపారు. మంత్రి గారి చొరవతో ధర్మవరం ప్రాంతంలో వైద్య రంగ అభివృద్ధికి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. పాత ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడం మరియు మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్‌కు కొత్త భవనం మంజూరు కావడం ద్వారా ధర్మవరం ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలు అందుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు.

అధికారులు కూడా మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి మార్గదర్శకత్వంలో ఈ పనులు త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ధర్మవరం ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని వారు స్పష్టం చేశారు.

## గ్రామ సర్వేరు హేమంత్ కు బదిలీ సన్మానం కార్యక్రమం





- గ్రామస్థాయిలో సర్వేరు యొక్క పాత్ర చాలా ప్రధానమైనది
- ప్రజలకు రెవెన్యూ సేవలను అందిస్తూ అందరికీ ఆదర్శంగా నిలవాలి
- విధుల పట్ల స్థానభ్రంశం తప్పనిసరి డిటి ఉదయ్ భాస్కర్



కూడేరు, మార్చి 10 (అనంత ప్రభ)

కూడేరు మండల తహశీల్దారు కార్యాలయం నందు మంగళవారం రోజున మండల రెవెన్యూ అధికారులు గ్రామ సర్వేయరు హేమంత్ కుమార్ కు ఘనంగా బదిలీ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. రెవెన్యూలో ఉద్యోగరీత్యా ప్రజలకు వివిధ రకాల సేవలను అందించిన వారికి శాలువాలు కప్పి సన్మానించడం ఆనవాయితీ, అందులో భాగంగా కూడేరు మండల రెవెన్యూ కార్యాలయం నందు మంగళవారం రోజున ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహశీల్దారు ఉదయభాస్కర్ మాట్లాడుతూ ఇటీవల కూడేరు మండల రెవిన్యూ లో హేమంత్ కుమార్ గ్రామ సర్వేయర్ గా విధులు నిర్వహిస్తూ ప్రజలకు తన వంతు బాధ్యతగా సేవలను అందించాలని తపనతో కార్యాలయానికి వస్తుండగా అదే క్రమంలో తన ప్రాణాలను సైతం పణంగా పెట్టి... 2 నెలలు పాటు ఆసుపత్రి చికిత్స పొందిన సందర్భాన్ని చూసామని అయితే హేమంత్ కుమార్ రెవిన్యూలో గ్రామ సర్వేయర్ గా పనిచేస్తూ ప్రజలకు ఉత్తమ సేవలను అందించినందుకు డిప్యూటీ తహశీల్దారు ఉదయ భాస్కర్ అభినందించారు. బదిలీ అనేది కొంచెం బాధగా అనిపించినా ఉద్యోగరీత్యా ఏదో ఒక రోజు ప్రతి ఒక్కరికి సానభ్రంశం తప్పదని డిప్యూటీ తహశీల్దారు ఉదయ భాస్కర్ అన్నారు. ఎక్కడ ఉన్నా రెవిన్యూలో ప్రజలతో మామేకమై అర్హత మేరకు రెవిన్యూలో ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించేందుకు ప్రయత్నించాలని వారు కోరారు. అనంతరం రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్ మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సర్వేయరు యొక్క పాత్ర చాలా ప్రధానమైనదని తమ వంతు బాధ్యతగా ప్రజల సమస్యల పరిష్కార దిశగా ప్రయత్నించాలని ఆయన అన్నారు. ఎక్కడ ఉన్నా దేవుడు మీకు ఆరోగ్య ఐశ్వర్యాలు ప్రసాదించాలని కోరుతూ ప్రజల యొక్క సమస్యలను తమ వంతు బాధ్యతగా స్వీకరించి అర్హత మేరకు ప్రజలకు సేవలను అందించి అందరికీ ఆదర్శంగా నిలవాలని రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు ఉదయ భాస్కర్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు ప్రసాద్, మండల సర్వేయర్ అయేషా, వారి సిబ్బంది. వీఆర్వోలు తదితరులు ఘనంగా సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు

## ప్రజా సమస్యల పరిష్కారానికి "మై టిడిపి" యాప్ -- శింగనమలలో పోస్టర్ల విడుదల



శింగనమల, మార్చి 10 (అనంత ప్రభ)

శింగనమల మండల కేంద్రంలోని శ్రీ ఆత్మా రామాలయం వద్ద "మై టిడిపి" యాప్‌కు సంబంధించిన పోస్టర్లను శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆదేశాల మేరకు శింగనమల మండల కన్వీనర్ గోరంట్ల మారుతి నాయుడు విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి పార్టీ కార్యకలాపాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, ప్రజా సమస్యలను వేగంగా పరిష్కరించడం కోసం "మై టిడిపి" యాప్‌ను రూపొందించారని తెలిపారు. ఈ యాప్ ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా నమోదు చేయగలరని, అలాగే పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాలు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై తాజా సమాచారం తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

"మై టిడిపి" యాప్ ద్వారా పార్టీ సభ్యత్వ నమోదు, కార్యకర్తలతో సమన్వయం, పార్టీ కార్యక్రమాల సమాచారం, ప్రజా సమస్యల నమోదు వంటి అనేక సదుపాయాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీని బలోపేతం చేయడంలో ఈ యాప్ ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

అలాగే ప్రతి టిడిపి కార్యకర్త ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని, ఎక్కువ మంది ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను త్వరగా గుర్తించి పరిష్కరించేందుకు ఈ యాప్ ఒక వేదికగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజల మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారమే లక్ష్యం



ధర్మవరం, మార్చి 10 (అనంత ప్రభ)

ధర్మవరం పట్టణంలోని సాయి నగర్ కాలనీలో నెలకొన్న మౌలిక సదుపాయాల సమస్యలపై ప్రజల అభ్యర్థన మేరకు మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి నాయకత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టింది. సోమవారం సాయి నగర్ కాలనీకి చెందిన పలువురు కాలనీ వాసులు మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి కార్యాలయాన్ని సందర్శించి తమ ప్రాంతంలో ఉన్న సమస్యలను వివరించారు. ముఖ్యంగా కాలనీలో పెండింగ్‌లో ఉన్న సిమెంట్ రోడ్ల నిర్మాణం, డ్రైనేజ్ కాలువల ఏర్పాటు వంటి మౌలిక సదుపాయాల కొరత వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు మంత్రి గారి కార్యాలయం దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకోవాలని వారు వినతిపత్రం అందజేశారు. మంత్రి సత్య కుమార్ యాదవ్ గారి నాయకత్వం నేపథ్యంలో మంగళవారం ఆయన నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు స్వయంగా సాయి నగర్ కాలనీని సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీలోని రహదారులు, డ్రైనేజ్ వ్యవస్థ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానికులతో మాట్లాడి వివరంగా తెలుసుకున్నారు. కాలనీ అభివృద్ధి కోసం అవసరమైన పనులను అధికారులతో సమన్వయం చేసి దశలవారీగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హరీష్ బాబు తెలిపారు. అలాగే ధర్మవరం పట్టణంలోని ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా మంత్రి సత్య కుమార్ యాదవ్ కట్టుబడి ఉన్నారని, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించే దిశగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వాటిపై వెంటనే స్పందించి పరిష్కారం చూపడం తమ బాధ్యత అని ఆయన అన్నారు

## బాల్య వివాహాల నియంత్రణపై పోస్టర్ల ను విడుదల చేసిన ఎన్జీవో




గుంతకల్లు, మార్చి 10 (అనంత ప్రభ)

గుంతకల్ పట్టణంలో రెడ్స్ ఎన్జీవో ఆధ్వర్యంలో వల్నరబుల్ కుటుంబాల లింకేజీలు, బాల్య వివాహాలు, ఫోక్సో కేసులు మరియు టీనేజ్ గర్భధారణ గురించి ఒక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశం రెడ్స్ ఎన్జీవో భానుజా సమక్షంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుంతకల్ ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణ స్వామి మరియు ఎంపీడీవో దేవాస్ దాస్ హాజరయ్యారు.

సమావేశంలో భానుజా మేడం శికారీ కుటుంబాలలో జరుగుతున్న బాల్య వివాహాలు మరియు టీనేజ్ గర్భధారణ సమస్యల గురించి మాట్లాడారు. అలాగే ఆధార్ కార్డు అప్‌డేట్స్, పెన్షన్లు మరియు రేషన్ కార్డుల గురించి ప్రజలతో చర్చించారు.

ఆరోగ్య శాఖ అధికారులు హైజీన్ పాటించడం మరియు టీనేజ్ గర్భధారణ వల్ల వచ్చే ఆరోగ్య సమస్యల గురించి సూచనలు ఇచ్చారు. విద్యాశాఖ అధికారులు డ్రాప్‌ఔట్ అయిన పిల్లల జాబితా గురించి వివరించి, వచ్చే సంవత్సరం వారికి హాస్టల్ సౌకర్యం కల్పించి చదువు కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తరువాత ఎం ఎస్ కె సభ్యులు మరియు సూపర్వైజర్ బాల్య వివాహాలు మరియు టీనేజ్ గర్భధారణ నివారణపై మాట్లాడి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎంపీడీవో దేవాస్ దాస్ ఆధార్ కార్డులు మరియు రేషన్ కార్డులు లేని కుటుంబాల విషయాన్ని చర్చించి, వాటిని ఆర్డీవో కు ఫార్వర్డ్ చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుమ్మనూరు నారాయణ స్వామి శికారీ కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి మాట్లాడి, వారికి సహాయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఆధార్ కార్డు కోసం నోటరీ సహాయం చేయిస్తామని చెప్పారు. అదేవిధంగా కుటుంబాల సహాయం కోసం ₹20,000 ఆర్థిక సహాయం అందిస్తామని ప్రకటించారు.

సమావేశం అనంతరం అతిథులు వార్డును సందర్శించి, బాల్య వివాహాల నిరోధానికి సంబంధించిన పోస్టర్లు విడుదల చేసి, బాల్య వివాహాలను అరికట్టాలని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడానికి యంగ్ ప్రొఫెషనల్ సదీస్ బాబు, ఏపీ ఎస్ డి పి ఎస్ నియోజకవర్గం సహకారం అందించారు. ఈ సమావేశంలో ఆరోగ్య, ఐసిడిఎస్, వెల్ఫేర్, విద్య, రెవెన్యూ, ప్లానింగ్ శాఖలు, వార్డు కౌన్సిలర్ మరియు ఇతర లైన్ డిపార్ట్మెంట్లు పాల్గొన్నారు.